నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, ఆదివారం 4 ఫిబ్రవరి 2024 | NIZAMABAD

**వందశాతం** మార్కులు సాధించేందుకు ప్రాక్టికల్ పరీక్షలు దోహదపడతాయి. అంత ప్రాధాన్యమున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు క్షేత్రస్థాయిలో భిన్నపరిస్థితులు నెలకొన్నాయి. ఆధునికతను అందిపుచ్చుకొని ముందుకుసాగాల్సిన ఈ రోజుల్లో పాత పద్ధతిలోనే ప్రాక్టికల్స్ నిర్వహిస్తూ మమ అనిపించుస్తున్నారు.



# మమ.. అనిపిస్తున్నారు

## నామమాత్రంగా ఇంటర్ ప్రాక్టికల్స్ నిర్వహణ

### పాత పద్ధతిలోనే పరీక్షలు.. మార్పులు చేయని ఇంటర్ బోర్డు

కామారెడ్డి, ఫిబ్రవరి 3: కామారెడ్డి జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యాయి. ఈ ప్రయోగ పరీక్షలను అధికారులు నామమాత్రంగా కొనసాగిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. గత ప్రభుత్వం జంబ్లింగ్ పద్ధతిలో నిర్వహించాలని నిర్ణయించినప్పటికీ నూతన ప్రభుత్వం వచ్చిన తర్వాత దానిని అమలు చేయకపోగా, పాత పద్ధతిలోనే కొనసాగిస్తున్నారు. అధికారులు కూడా మొక్కుబడిగా ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలు కళాశాలల్లో ప్రయోగాలకు సంబంధించిన పరికరాలు సరిగ్గా లేకున్నా తూతూ మంత్రంగా కొనసాగిస్తున్నారు. ఇంటర్ చదివే విద్యార్థులు వార్షిక పరీక్షల్లో మార్కులు సాధించడం ఎంత ముఖ్యమో... ప్రయోగ పరీక్షల్లో సాధించే మార్కులు కూడా అంతే కీలకంగా మారుతాయి. అందుకోసం విద్యార్థులు ముందు నుంచే సన్నద్ధం కావాల్సి ఉంటుంది. కానీ కొన్ని కళాశాలల్లో ప్రయోగ పాఠాలు నిర్వహించకుండా, విద్యార్థులను ముందస్తుగా సంసిద్ధులను చేయకుండానే ప్రాక్టికల్స్ నిర్వహించడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. తమ పిల్లలకు మంచి మార్కులు వస్తాయో.. రావో అని బాధపడుతున్నారు.



**పొరపాట్లు లేకుండా చూస్తున్నాం**

జిల్లాలో ఎక్కడా పొరపాటు లేకుండా ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహిస్తున్నాం. ఈ ఏడాది పాత పద్ధతినే కొనసాగిస్తున్నాం. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

**-షేక్ సలాం, జిల్లా ఇంటర్ నోడల్ అధికారి, కామారెడ్డి**

## నో నాయిస్.. ఇక సైలెన్స్..

కామారెడ్డి, ఫిబ్రవరి 3: నిబంధనలకు విరుద్ధంగా మోటరు సైకిళ్లకు అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లను కామారెడ్డి పట్టణ పోలీసులు రోడ్ రోలర్‌తో తొక్కించారు. నెల రోజుల నుంచి వాహన తనిఖీలు నిర్వహించగా పలువురు వాహనదారులు మోడిఫైడ్ సైలెన్సర్లను వాడుతూ పట్టుబడ్డారు. దీంతో 26 బైక్‌లకు బిగించిన సైలెన్సర్లను తొలగించి, నిబంధనల మేరకు పంచనామా నిర్వహించి రోడ్ రోలర్ సహాయంతో శనివారం తొక్కించి ధ్వంసం చేసినట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## నేడు ప్రతిభ కళాశాల ప్రవేశ పరీక్ష

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 3: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభా కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి సంబంధించిన ప్రవేశ పరీక్ష (సీవోఈ సెట్- 2024) ఆదివారం నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎంపిక చేసిన కేంద్రాల్లో పరీక్ష ఉంటుంది. నిజామాబాద్ జిల్లాలో టీఎస్‌డబ్ల్యూఆర్ ఎస్‌అండ్‌జేసీ ధర్మారం, కంజర, ఆర్మూర్(బాలుర), సుద్దపల్లి, పోచంపాడ్, నవీపేట్(బాలికల), కామారెడ్డి జిల్లాలో టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్‌అండ్‌జేసీ ఎల్లారెడ్డి, భిక్కనూర్, దోమకొండ, తాడ్వాయి, తాడ్కోల్, ఎక్లరా, బాన్సువాడ, తక్కడ్‌పల్లి (పెద్దకొడప్‌గల్), కొయ్యగుట్ట, నిర్మల్ జిల్లాలోని ముథోల్, లెఫ్ట్ పోచంపాడ్, జామ్, కడెం, భైంసాలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ నిజామాబాద్ ప్రాంతీయ సమన్వయాధికారిణి అలివేలు తెలిపారు. అభ్యర్థులు www.tswreis.ac.in వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. నిర్ణీత సమయానికి గంట ముందుగానే సెంటర్ వద్దకు చేరుకోవాలని తెలిపారు.




# సదరం స్లాట్లు.. దివ్యాంగుల పాట్లు

**కామారెడ్డి జిల్లాలో 280 స్లాట్లు మాత్రమే..**

గతంలో డివిజన్, మండలస్థాయిలో అప్పుడప్పుడు ప్రత్యేకంగా సదరం శిబిరాలను ఏర్పాటు చేసేవారు. మండలస్థాయిలో దరఖాస్తు చేసుకుంటే వారి సూచన మేరకు జిల్లా కేంద్రాల్లో వైకల్య నిర్ధారణ పరీక్షలు చేసి సర్టిఫికెట్లను జారీ చేసేవారు. కొంతకాలంగా కేవలం జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వ దవాఖానల్లో సదరం శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఇందుకోసం ప్రతినెలా కొన్ని స్లాట్లు విడుదల చేస్తున్నారు. కొన్ని కారణాలతో అప్పుడప్పుడు వీటిని కూడా రద్దు చేస్తున్నారు. దీంతో బాధితుల సంఖ్య పెరుగుతూనే ఉన్నది. నిజామాబాద్ జిల్లాలో గతనెల 480 స్లాట్లను విడుదల చేశారు. బాధితుల సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో ఈనెల స్లాట్లను 780కి పెంచారు. కానీ, కామారెడ్డి జిల్లాలో ఈ నెల 280 స్లాట్లు మాత్రమే విడుదల చేయడంతో చాలా మందికి అవకాశం దక్కలేదు.

**మండల స్థాయిలోనే పరీక్షలు నిర్వహించాలి..**

జిల్లా కేంద్రంలో సదరం క్యాంపునకు హాజరయ్యే ముందు మండల కేంద్రాల్లోనే పరీక్షలు నిర్వహించి అర్హత ఉన్నవారిని ఎంపిక చేయాలని బాధితులు కోరుతున్నారు. దీంతో అనర్హులను మండలస్థాయిలోనే నిలిపేయవచ్చని అభిప్రాయపడుతున్నారు. ఈ విధానంతో అర్హులకు త్వరగా సదరం సర్టిఫికెట్ వస్తుందని అంటున్నారు. లేదంటే సదరం స్లాట్ల కోసం అష్టకష్టాలు తప్పడంలేదని వాపోతున్నారు. ఆర్థో, వినికిడి, చూపు, మానసిక వైకల్యం వంటి అంశాలకు సంబంధించి మండలస్థాయిలోనే గుర్తించి క్యాంపునకు పంపాలని కోరుతున్నారు.

- బాధితులకు దొరకని సదరం స్లాట్లు
- కామారెడ్డి జిల్లాలో ఈ నెల 280 మందికే అవకాశం
- మీసేవ కేంద్రాల వద్ద తెల్లవారు జామునుంచే పడిగాపులు
- అవకాశం దక్కక నిరాశగా వెనుదిరుగుతున్న వందలమంది
- పట్టించుకోని అధికారులు

**దేవుడు వరమిచ్చినా..** పూజారి ఫలమివ్వని తీరుగా మారింది దివ్యాంగుల పరిస్థితి. వైకల్యంతో బాధపడేవారికి ప్రభుత్వం అండగా నిలిచేందుకు ఆసరా పింఛన్లు, ఇతర ప్రోత్సాహకాలను అందిస్తున్నది. ఈ పథకాల ద్వారా లబ్ధిపొందాలంటే తప్పనిసరిగా అధికారులు జారీచేసిన సదరం సర్టిఫికెట్లను సమర్పించాల్సి ఉంటుంది. వైద్యులు వైకల్యం శాతం నిర్ధారించిన అనంతరం సదరం సర్టిఫికెట్లను జారీ చేస్తారు. ఇందుకోసం ప్రతినెలా శిబిరాలను ఏర్పాటుచేసి వైద్య పరీక్షలు చేస్తున్నారు. ఇందులో భాగంగా సదరం శిబిరాలకు హాజరయ్యేవారు ముందుగానే మీసేవ కేంద్రాల ద్వారా స్లాట్లను బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. అధికారులు తక్కువ సంఖ్యలో స్లాట్లను విడుదల చేయడంతో చాలా మంది బాధితులకు అవకాశం దక్కకడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

–ఎల్లారెడ్డి/చందూర్, ఫిబ్రవరి 3

### ప్రతినెలా పడిగాపులే..

పుట్టుకతో సమస్యలు లేదా వివిధ ప్రమాదాల కారణంగా వైకల్యంతో బాధపడుతున్న వారు సదరం సర్టిఫికెట్ల కోసం ఎదురు చూస్తున్నారు. అధికారులు స్లాట్లు విడుదల చేయగానే పడుతూ.. లేస్తూ.. ఆశగా మీసేవ కేంద్రాలకు చేరుకుంటున్నారు. తెల్లవారు జామునుంచే క్యూ కడుతున్నారు. వేల సంఖ్యలో బాధితులు ఉంటే.. అధికారులు కేవలం వందల సంఖ్యలోనే స్లాట్లు విడుదల చేస్తున్నారు. ఒక్కో మీసేవ కేంద్రం వద్ద 50 నుంచి 100 మంది వరకు స్లాట్ కోసం వస్తే కేవలం ఒక్కరిద్దరికే అవకాశం దక్కుతున్నది. దీంతో తిండీతిప్పలు లేకుండా పడిగాపులు కాసి, ఊసురుమంటూ వెనుదిరుగుతున్నారు. అయితే నిమిషాల్లోనే స్లాట్లు పూర్తికావడంపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎవరైనా బ్లాక్ చేస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. కొన్ని ప్రాంతాల వారికే స్లాట్లు బుక్ అవుతున్నాయని అంటున్నారు. కొందరైతే ఏడాదిగా ప్రయత్నిస్తున్నా అవకాశం రావడం లేదంటున్నారు. ప్రతినెలా మీసేవ కేంద్రానికి వెళ్లి.. నిరాశతో ఇంటికి రావాల్సివస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఎల్లారెడ్డి మండలంలో కేవలం ఇద్దరికే స్లాట్లు..**

ఎల్లారెడ్డిలోని మూడు మీసేవ కేంద్రాల్లో స్లాట్లు బుక్ చేసుకునేందుకు శనివారం వందకుపైగా బాధితులు తరలివచ్చారు. కానీ మండలంలో కేవలం ఇద్దరికి మాత్రమే స్లాట్ లభించింది. మిగితావారంతా నిరాశతో వెనుదిరిగారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తున్నది. చాలామంది నెలల తరబడి స్లాట్ కోసం ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. ఎల్లారెడ్డి మండలం తిమ్మారెడ్డి గ్రామానికి చెందిన చాకలి లచ్చమ్మ నాలుగు నెలలుగా సదరం స్లాట్ కోసం ఎల్లారెడ్డికి వస్తున్నానని తెలిపింది. కానీ స్లాట్ దొరకడంలేదని కంటతడి పెట్టింది. ఇలాగే ఎంతో ఖర్చుచేసి వందల మంది వివిధ గ్రామాల నుంచి స్లాట్ల కోసం మండల కేంద్రాలు, పట్టణాలకు వస్తున్నారు. మీసేవ కేంద్రాల నిర్వాహకులు కూడా ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. ఇకనైనా అధికారులు స్పందించి స్లాట్ల సంఖ్యను పెంచాలని బాధితులు కోరుతున్నారు.



చందూర్ మండలకేంద్రంలోని మీసేవ కేంద్రానికి సదరం స్లాట్ కోసం వచ్చిన దివ్యాంగులు

# ఎల్ఎండీకి నీటి విడుదల ఆపండి



ఎస్సారెస్పీ ఉన్నతాధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

**ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి**

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 3: ఎస్సారెస్పీ నుంచి వరదకాలువ ద్వారా ఎల్ఎండీకి నీటి విడుదలను వెంటనే ఆపాలని ఎస్సారెస్పీ ఉన్నతాధికారులకు బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సూచించారు. ఎస్సారెస్పీ నుంచి కొద్దిరోజులుగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎల్ఎండీకి నీటి విడుదల జరుగుతున్నది. మరోవైపు ఎస్సారెస్పీలో అందుబాటులో ఉన్న నీటి నిల్వ, ప్రాజెక్టు పరిధిలోని నిజామాబాద్ జిల్లా ఆయకట్టుకు సాగు, తాగు నీటికి నీటి ఆవశ్యకత దృష్ట్యా ఆందోళన మొదలైంది. దీంతో రైతుల కోరిక మేరకు ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి శనివారం సాయంత్రం ఎస్సారెస్పీ సీఈ, ఎస్ఈతో ఫోన్‌లో మాట్లాడారు. ఎల్ఎండీకి వరదకాలువ ద్వారా ఎంత నీటి విడుదలకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది ? ఈ రోజు వరకు ఎంత విడుదల చేశారు... తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. 3 టీఎంసీల వరకే నీటి విడుదల చేయాలని ఉత్తర్వులు ఉంటే అంతకు మించి విడుదల జరిగినట్లు అధికారుల వివరణలో వెల్లడైంది. దీంతో ఎల్ఎండీకి వెంటనే నీటి విడుదల ఆపాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. జిల్లాలో చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి, లక్ష్మీ కెనాల్, గుత్ప, అలీసాగర్ తదితర లిఫ్టులు, ప్యాకేజీ 21 కింద ఆయకట్టుకు సాగునీరు, మిషన్ భగీరథ ద్వారా ప్రజలకు తాగునీరు ఇవ్వాల్సి ఉన్నందున నీటి విడుదల ఆపివేయాలని ఎమ్మెల్యే అన్నారు. నీటి విడుదల ఆపివేసి వరదకాలువను పూర్తిగా నింపి పెట్టాలని సూచించారు. ఇందుకు అధికారులు సానుకూలంగా స్పందించారు. సాగు, తాగునీటి అవసరాలు, రైతుల్లో నెలకొన్న ఆందోళనను గుర్తించి ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడడంపై రైతుల్లో హర్షంవ్యక్తమవుతున్నది. వరదకాలువ ద్వారా ఎల్ఎండీకి మరోసారి నీటి విడుదలకు ఏవైనా ఆదేశాలు వస్తే తన దృష్టికి తేవాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు.

ఇదిలా ఉండగా ఉన్నతాధికారుల ఆదేశాలతో శనివారం సాయంత్రం నీటివిడుదల నిలిపివేశారు.

## రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు



44వ జాతీయ రహదారిని పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడుతున్న సీపీ కల్మేశ్వర్

**పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్**

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 3 : రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టినట్లు సీపీ కల్మేశ్వర్ తెలిపారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని 44వ జాతీయ రహదారిపై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుండడంతో రోడ్డును సంబంధిత అధికారులతో కలిసి సీపీ శనివారం పరిశీలించారు. ఇందల్వాయి పోలీస్‌స్టేషన్ పరిధిలోని దగ్గి అటవీ ప్రాంతం నుంచి మెండోరా పోలీస్‌స్టేషన్ పరిధిలోని చాకిర్యాల్ వరకు 71 కిలో మీటర్ల మేర నేషనల్ హైవే పరిశీలించారు. పోలీసు, రవాణా, జాతీయ రహదారుల అథారిటీ, ఐరాడ్ విభాగం, ఫుడ్ సేఫ్టీ విభాగాలతో రోడ్డు ప్రమాదాలపై అధ్యయనం చేసినట్లు సీపీ తెలిపారు. జాతీయ రహదారిపై ఉన్న యూ టర్న్‌లను క్లోజ్ చేయాలని, అనుమతిలేని దాబాలు, వ్యాపార సముదాయాలపై చర్యలు తీసుకోవాలని, గుర్తించిన ప్రాంతాల్లో సర్వీసు రోడ్లు ఏర్పాటు చేయాలని, అవసరమైన ప్రాంతాల్లో వాహనాల వేగం తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని, హైరిస్క్ ప్రాంతాల్లో సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సీపీ సూచించారు. సీపీ వెంట సంబంధిత శాఖ అధికారులు ఉన్నారు.

### బాలికపై లైంగికదాడికి యత్నం

బాన్సువాడ, ఫిబ్రవరి 3: బాన్సువాడ పట్టణంలోని ఒక లాడ్జిలో బాలికపై శనివారం లైంగిక దాడికి యత్నించినట్లు తెలిసింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఎల్లారెడ్డి ప్రాంతానికి చెందిన బాలికను తండ్రి పాఠశాలలో దింపమని అదే ప్రాంతానికి చెందిన యువకుడికి చెప్పాడు. యువకుడు బాలికను పాఠశాలలో దింపకుండా బాన్సువాడ పట్టణంలోని లాడ్జికి తీసుకొచ్చాడు. బాలికపై లైంగికదాడికి యత్నించగా కేకలు పెట్టింది. గమనించిన స్థానికులు యువకుడిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు.

### నెగ్గిన అవిశ్వాసం

వర్ని, ఫిబ్రవరి 3: వర్ని మండలం జాకోర సహకార సంఘం డైరెక్టర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. పీఏసీఎస్ అధ్యక్షుడిగా ఉన్న కృష్ణారెడ్డిపై సభ్యులు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టగా, శనివారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. డీసీవో శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి హాజరైన 10మంది డైరెక్టర్లు అవిశ్వాసానికి మద్దతు పలుకుతూ ఓటు వేశారు. దీంతో కృష్ణారెడ్డి పదవిని కోల్పోయారు. అనంతరం కొత్త చైర్మన్ ఎన్నిక నిర్వహించగా వర్ని మండలం సిద్దాపూర్ గ్రామానికి చెందిన డైరెక్టర్ బర్దావల్ దశరథ్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## బాలుడి కిడ్నాప్ కథ సుఖాంతం

- మహిళే ప్రధాన సూత్రధారి..
- హైదరాబాద్‌లో రూ.3 లక్షలకు విక్రయం
- నలుగురు ముఠా సభ్యుల గుర్తింపు.. ముగ్గురి అరెస్టు, పరారీలో మరొకరు

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 3 : నగరంలోని మాలపల్లికి చెందిన ఏడేండ్ల బాలుడు మహ్మద్ మిహాజ్ కిడ్నాప్ కేసు సుఖాంతమయ్యింది. జనవరి 30న బాలుడు కిడ్నాప్‌నకు గురికాగా.. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించగా.. స్థానికంగా ఉండే సోహైల్ అనే కారుడ్రైవర్ తన బైక్‌పై తీసుకెళ్లినట్లు గుర్తించారు. సోహైల్‌ను హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకొని, విచారించగా.. నేరాన్ని అంగీకరించాడు. బాలుడిని పోలీసులు శనివారం తల్లిదండ్రులకు అప్పగించారు.

**చక్రం తిప్పిన పాత నేరస్తురాలు?**

మాలపల్లికి చెందిన ఓ మహిళ బాలుడి కిడ్నాప్‌లో ప్రధాన పాత్ర పోషించింది. ఆమె గతంలోనూ ఓ బాలుడిని విక్రయించిన కేసులో నేరస్తురాలు. మళ్లీ అలాంటి చర్యలకు పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో తేలినట్లు సమాచారం. హైదరాబాద్‌కు చెందిన వారికి ఓ బాలుడి అవసరం ఉందనే విషయాన్ని తెలుసుకున్న ఆమె.. వారితో ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం. బాలుడిని కిడ్నాప్ చేసి తనకు ఇస్తే పెద్దమొత్తంలో డబ్బు ఇస్తానంటూ సోహైల్‌కు ఆశ చూపగా.. బాలుడిని కిడ్నాప్ చేసి, షేక్ ఆబేద్, షబానా బేగానికి అప్పగించాడు. వారు హైదరాబాద్‌లోని ముఠాకు రూ. 3 లక్షలకు విక్రయించినట్లు అదనపు డీసీపీ జయరాం వెల్లడించారు. కిడ్నాపర్ సోహైల్‌కు రూ.70 వేలు చెల్లించినట్లు తెలిపారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేయగా.. మరొకరు పరారీలో ఉన్నట్లు తెలిసింది.



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీస్ అధికారులు

### ప్రభుత్వ సలహాదారుడిగా షబ్బీర్ అలీ బాధ్యతల స్వీకరణ

కామారెడ్డి, ఫిబ్రవరి 3: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడిగా షబ్బీర్ అలీ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీకి మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల కాంగ్రెస్ నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



## గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

కామారెడ్డి, ఫిబ్రవరి 3: గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, ప్రత్యేక అధికారుల పాలన ద్వారా అమలు చేస్తామని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ములుగు జిల్లా కలెక్టరేట్ నుంచి శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, కమిషనర్ హన్మంతరావులతో కలిసి కలెక్టర్లు, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిందని అన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 7 నుంచి 14 వరకు పారిశుద్ధ్య కార్యక్రమాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నామని, ప్రజాప్రతినిధులు, మహిళలు, యువతను భాగస్వాములు చేయాలని ఆదేశించారు. కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ మాట్లాడుతూ స్పెషల్ ఆఫీసర్లు పంచాయతీ కార్యదర్శులను సమన్వయం చేసుకొని పనిచేసేలా బాధ్యతలు ఇచ్చామన్నారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. డీఆర్డీవో సాయన్న, జడ్పీ సీఈవో సాయాగౌడ్, డీపీవో శ్రీనివాస్, పీఆర్ ఈఈ మురళి, మిషన్ భగీరథ ఈఈ రమేశ్ పాల్గొన్నారు.





కలెక్టర్లతో వీసీలో మంత్రి సీతక్క